ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు: జేసీ

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శోభిక హెచ్చరించారు. కోడ్ అమలులో ఉన్నందున విధిగా ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బందితో సమీక్షించారు. ప్రవర్తనా నియామావళి అమల్లో నిర్లక్ష్యంగా ఉండరాదని స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా సమస్యలు తలెత్తరాదని తెలిపారు. గ్రామ, మండల స్థాయిల్లో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

అక్కడలా.. ఇక్కడిలా..!


ఉల్లిభద్ర సమీపంలో అప్పట్లో చంద్రబాబు ఆవిష్కరించిన శిలాఫలకానికి సున్నం వేసిన దృశ్యం

● కోడ్ అమలులో సచివాలయం సిబ్బంది తీరుపై విమర్శల వెల్లువ

గరుగుబిల్లి, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం ప్రదర్శించరాదని జిల్లా అధికారులు చెబుతున్నా.. కొంతమంది సచివాలయాల సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. ఒక్కోచోట ఒక్కోలా వ్యవహరిస్తుండడంపై స్థానికులు, ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. ప్రధానంగా అధికార పార్టీ నేతలు ఆవిష్కరించే శిలాఫలకాలకు కోడ్ వర్తించదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఉల్లిభద్ర సమీపంలో తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి సాగునీరు ఏర్పాటుకు 2015 సెప్టెంబరు 10న అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే కోడ్ నేపథ్యంలో తాజాగా దానికి సున్నం వేశారు. కాగా ఈ నెల 1న సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్ట రహదారికి కురుపాం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. దానిపై సీఎం జగన్, ఎమ్మెల్యే చిత్రాలు ఉన్నాయి. అయితే వాటిపై నామమాత్రంగా అంటించిన పేపర్లు కొద్ది రోజులకే ఊడిపోయాయి. కాగా ఇంతవరకు దీనిపై అధికారులు స్పందించకపోవడంపై ఆ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది సచివాలయ సిబ్బంది వైఖరిని తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి శిలాఫలకాలపై ఆ చిత్రాలు కనిపించకుండా తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


సంతోషపురం పంచాయతీలో సీఎం జగన్ చిత్రం కనిపిస్తున్న శిలాఫలకం

చెరువులో కొండ చిలువలు

పార్వతీపురం మండలం వెంకమ్మపేట గ్రామ సమీపంలో ఉన్న చెరువులో రెండు కొండచిలువలు కనిపించాయి. దీంతో స్థానికులు, మత్స్యకారులు షాక్‌కు గురయ్యారు. వాటిని బంధించి అటవీశాఖాధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. రోజూలానే మంగళవారం మత్స్యకారులు ఆ గ్రామంలోని చెరువులో చేపల వేటకు వెళ్లారు. ఇదే సమయంలో ఓ భారీ కొండ చిలువ, దాని పిల్ల వారికి కనిపించాయి. స్థానికుల సాయంతో వాటిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి బోనులో బంధించారు. అటవీశాఖాధికారులు అక్కడకు చేరుకుని కొండ చిలువలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల వారు వాటిని చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. - పార్వతీపురం రూరల్



రెండు నెలలుగా చెల్లింపుల్లేవ్!

● 'ఉపాధి' పనులకు వెళ్తున్నా.. అందని కూలి
● జిల్లాలో వేతన బకాయిలు రూ.4 కోట్లు
● ఇబ్బందుల్లో వేతనదారులు


ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఉపాధి హామీ వేతనదారుల పరిస్థితి దయనీయంగా మారింది. పనులు చేస్తున్నా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. సుమారు ఎనిమిది వారాలుగా వేతనాల చెల్లింపులు జరగకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎందుకు పనికి వెళ్తున్నామా? అంటూ ఆవేదన చెందుతున్నారు. ప్రైవేట్ పనులకు వెళ్తే.. ఏ రోజు కూలి ఆ రోజే అందుతుండగా.. రోజూ ఉపాధి పనులు చేస్తున్నా.. వేతనాలు అందించకపోవడంపై వారు మండిపడుతున్నారు. నెలలు గడుస్తున్నా బకాయి వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు.

కోట్లాది రూపాయలు పెండింగ్...

జిల్లాలోని 15 మండలాల్లో ఉపాధి పనులను చేపడుతు న్నారు. నిబంధనల ప్రకారం అర్హులందరికీ పనులు కల్పిస్తున్నారు. అత్యధికంగా వేతనదారులు హాజరవుతున్నా.. సకాలంలో వారికి చెల్లింపులు జరగడం లేదు. నిబంధనల మేరకు వారానికి ఒకసారి వేతనాల చెల్లింపులు జరగాల్సి ఉంది. కనీసం రెండు వారాలకు ఒక్కసారైనా చెల్లింపులు చేస్తే.. కూలీలకు ఏ ఇబ్బంది ఉండేది కాదు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వేతనదారులు నానా అవస్థలు పడుతు న్నారు. మొత్తగా జిల్లాలోని ఉపాధి వేతనదారులకు సుమారు రూ. నాలుగు కోట్ల మేర వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది సంక్రాంతి తర్వాత పూర్తిగా చెల్లింపులు నిలిచిపోయాయి. సుమారు ఎనిమిది వారాలు గడుస్తున్నా .. వాటిపై అతీగతీ లేదు. ఉపాధి కూలీలకు ఎప్పుడు వేతనాలు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై ఉపాధి పర్య వేక్షణ సిబ్బంది, అధికారులు కూడా ఏమీ చెప్ప లేక పోతున్నారు. వేతనాలు లేకుండా పనులు కల్పించి లాభమేమిటని మరోవైపు వేతనదారులు ప్రశ్ని స్తున్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిం దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే చెల్లింపులు

జిల్లాలో వేతనదారులకు త్వరగా బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిధులు మంజూరైన వెంటనే చెల్లింపులు ప్రారంభమవుతాయి.

- పి.రామచంద్రరావు, పీడీ, డ్వామా, పార్వతీపురం మన్యం

గోడలపై రాతలకు అనుమతి లేదు

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

పార్వతీపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా గోడలపై రాతలకు అనుమతి లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల ప్రాంగణాలు, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లకు అనుమతించరాదని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయడంలో ఎటువంటి అలసత్వం వహించరాదన్నారు. సీ-విజిల్ ద్వారా అందే ఫిర్యాదుల సకాలంలో పరిష్కరించాలని, మద్యం విక్రయాలపై పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికి రాదన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ నియామవళి పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీతంపేట ఐటీడీఏల పీవోలు విష్ణుచరణ్, కల్పనాకుమారి, జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించరాదు

● అధికారులకు ఐటీడీఏ పీవోల ఆదేశం


మక్కువ: అధికారులతో చర్చిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో

పాలకొండ/వీరఘట్టం/మక్కువ: ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి హెచ్చరించారు. మంగళవారం ఆమె పట్టణంలో పర్యటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమాళి అమలును పరిశీలించారు. ఇంకా ఎక్కడైనా రాజకీయ నాయకుల పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు ఉంటే వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలు, శిలా ఫలకాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. పక్కాగా ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు. ఈ పరిశీలనలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు. అనంతరం ఆమె వీరఘట్టంలో పర్యటించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును పరిశీలించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ జయప్రకాష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు. ● ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో, సాలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ సి.విష్ణుచరణ్ అన్నారు. మక్కువ, వెంకట భైరిపురంలో సచివాలయాలు, మక్కువ పీహెచ్‌సీ, జడ్పీ పాఠశాలలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో ఫ్లెక్సీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలన్నారు. ఎంపీ డీవో దేవకుమార్, డీటీ హేమలత, పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి హరికృష్ణ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


పాలకొండలో సిబ్బందికి సూచనలిస్తున్న సీతంపేట ఐటీడీఏ పీవో

పడిగాపులు.. పరుగులు



భామినిలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్సుల కోసం పడిగాపులు కాస్తూ.. పరుగులు పెట్టాల్సి వస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసిన తర్వాత బాలేరు, పెద్దదిమిలివైపు వెళ్లే విద్యార్థులు భామిని బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే సుమారు గంట వరకు నిరీక్షించినా.. బస్సులేవీ రాకపోవడంతో చెట్లు కింద, దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. ఆ తర్వాత వచ్చిన బస్సు కోసం ఇలా పరుగులు పెడుతూ ఎక్కారు. అయినప్పటికీ చాలామంది ఆ బస్సును ఎక్కలేకపోయారు. టెన్త్ పరీక్షల నేపథ్యంలో పెద్దదిమిలి, బాలేరు వైపు వెళ్లేందుకు భామిని సెంటర్ బస్సు నడపాలని వారు కోరుతున్నారు. - భామిని

శంబరకు పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

● ఘనంగా తొమ్మిదో వారం జాతర
● పోలమాంబ దర్శనానికి బారులు

మక్కువ: శంబరకు భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం.. కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలమాంబ దర్శనానికి బారులుదీరారు. తొమ్మిదో వారం జాతర సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి భారీగా భక్తజనం తరలివచ్చారు. దీంతో మంగళవారం వనం, చదురుగుడిలో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. గంటలకొద్దీ నిరీక్షించిన అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. 'పోలమాంబ.. కరుణించు' అంటూ వేడుకున్నారు. అనంతరం వనంగుడి వద్ద వేపచెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గోముఖీ నదీతీరాన కోళ్లు, చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు వనం గుడి సమీప తోటల్లో చెట్ల కింద వంటావార్పు చేసుకున్నారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే భోజనాలు చేశారు. ఈవో సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


చదురుగుడిలో పోలమాంబ

ఐదేళ్లలో తిరోగమనంలోకి రాష్ట్రం

● అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తనని గెలిపించాలని కోరుతూ అదితి గజపతిరాజు నగరంలోని ఐదో డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నాగరాజు, ఆ డివిజన్ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎన్నికల కార్యాలయాన్ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐదేళ్ల కాలంలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందన్నారు. తిరోగమనంలోకి వెళ్లిన రాష్ట్రాన్ని పురోగమనంలోకి తీసుకువెళ్లాలంటే చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ నాయకుడు అవసరమన్నారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నగర నాయకులు, తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, అదితి యువసేన నాయకులు, ప్రతినిధులు పసుపు రంగు టీ షర్టుని ధరించి, ప్రచారంలో పాల్గొన్నారు. ఆమె బాబామెట్టలోని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను వివరించారు. ఐదో డివిజన్ పరిధిలో ప్రచారం నిర్వహించిన అదితి గజపతిరాజుకి అడగడుగునా ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చి ఆమెను ఆశీర్వదించారు. ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు కటౌట్లను కార్యకర్తలు పట్టుకుని ప్రచారంలో ముందుకు సాగారు. ఈ కటౌట్లతో పాటు, రాజులు ధరించిన ప్రత్యేక పసుపు టోపీలను కూడా కార్యకర్తలు ధరించి ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ ప్రచారం

విజయనగరం రూరల్: విజయనగరంలోని 49వ డివిజన్‌లో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మామిడి రవిశంకర్, కందువా ప్రకాష్, శంకరావుతో పాటు నాయకులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు.

ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్

విజయనగరం రూరల్: విజయనగరంలోని అన్ని రీడింగ్ రూంలకు తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాలేదని, ఉన్న పరిశ్రమలు మూతపడినా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పొగిరి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బేబీనాయన ప్రచారం

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) బుధవారం ఉదయం స్థానిక రాజానగర్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు తెలిపారు. పట్టణానికి చెందిన మూడు పార్టీల శ్రేణులంతా స్థానిక సంతతోటకు బుధవారం ఉదయం 7.30 గంటలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న రాయవరపు చంద్రశేఖర్

శృంగవరపుకోట: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం శృంగవరపుకోటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ కార్యాలయం వద్ద కార్యకర్తలతో సమావేశమయ్యారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రయితేనే మహిళలకు రక్షణ, యువతకు ఉద్యోగాలు, రైతులకు వ్యవసాయ సదుపాయాలు వంటివి కలుగుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గ్రామాల్లో వివరించాలని కోరారు. నాయకులు జుత్తాడ రామసత్యం, అడారి రమేష్, మాదిబోయిన మంగరాజు తదితరులు వున్నారు.

పేదలకు చీరల పంపిణీ

జామి: మండలంలోని అట్టాడలో వున్న బీఎస్ఆర్ ఆశ్రమం అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని భీశెట్టి ఫౌండేషన్ అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. మంగళవారం ఈ ఆశ్రమం నాల్గో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లుగా నిత్యాన్నదానం చేస్తూ మండలంలో వైద్యశిబిరాలు, విద్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవకు మరో రూపంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో దవడ మీనా, కొండబాబు, ఆశా మహాలక్ష్మి, ఆళ్ల శిరీష, హరిత తదితరులున్నారు.

బాడంగిలో పారిశుధ్య పనులు



పూడికలను తొలగిస్తున్న దృశ్యం

బాడంగి, మార్చి 19: మండల కేంద్రంలోని బాడంగిలో టీడీపీ సర్పంచ్ కండి రమేష్ దగ్గరుండి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కాలువల్లోని ఊడికలను తీయించి గ్రామానికి సుదూరంగా పారవేయించారు. అలాగే మురుగునీటి గుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే రోడ్లపై ఉన్న చెత్తను కూడా పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగించారు.

గర్భిణులకు యోగా శిక్షణ



యోగాపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

బొబ్బిలి: స్థానిక మల్లమ్మపేట రెండో సెక్టారు పరిధి 22, 23 వార్డులకు చెందిన అంగన్వాడీ కేంద్రాలలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. గర్భిణులకు యోగాపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీఓ జె.విజయలక్ష్మి, సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బీసీల పక్షపాతి



పార్టీలో చేరిన వారితో అదితి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు

రాజాం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళ వారం శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజాం పట్టణంలో ప్రధాన రహదారి పనులు ప్రారంభించి నేటికి ఏడాది కావస్తున్నా ఇంతవరకు పూర్తిచేయలేని దౌర్భాగ్యపు పరిస్థితి ఏర్పడిం దన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకు వస్తే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుం దన్నారు. పార్టీ నాయకులు దుప్పలపూడి శ్రీనివాసరావు, దూబ ధర్మారావు, నాగళ్ల అప్పలనాయుడు, గ్రంధి గోపి, రగుమండల గణపతినాయుడు, కడగల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక..

పెనుబాక గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి మాజీ సర్పంచ్ చీడికు మార్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మంగళవారం శ్యాంపురం క్యాంపు కార్యాల యంలో కోండ్రు మురళీమోహన్ వారికి పార్టీ కండువా వేసి, పార్టీలోకి ఆహ్వా నించారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందని, అవినీతి, దోపిడీలో అధికార వైసీపీ నేతలు పోటీపడ్డారని ఆదివారం నిర్వహించిన ఎన్డీఏ సభ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారన్నారు. లక్షలాది మంది ప్రజలు హాజరైన సభ వద్ద ప్రజా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీసులు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేయాలని ఆయన కోరా రు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి చిన్నారావు, రాము, శ్రీను, వజ్జిపర్తి రాము, ఇందుగు బల్లి సూర్యనారాయణ, చిలకలపల్లి రమణ, తదితరులు టీడీపీలో చేరారు.

విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే వీరభద్రస్వామి ఏకపక్ష నిర్ణయాలు.... ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు విసుగుచెంది నగరంలోని 8, 12, 27, 31, 40 డివిజన్లకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి మంగళవారం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆ డివిజన్లకు చెందిన పి.రామలక్ష్మి, వి.చంద్రావతి, పడగల అంజిబాబు, ఆర్.రాజు, జి.మోహన్, శివ, కె.సుబ్బారావు, సీహెచ్.జోగారావు, ఎం హేమంత్‌బాబు, పి.మహేష్‌లతో పాటు వారి కుటుంబ సభ్యులు, అనుచరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా అదితి మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు నచ్చి, టీడీపీలో చేరడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సూపర్ సిక్స్ పథకాలతో శాశ్వత ప్రయోజనం



ఇంటింటి ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

దత్తిరాజేరు: టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని విజయరాంపురం, షికారు గంజి గ్రామాల్లో ఆయన మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. వర్షంలో ప్రచారం చేస్తున్న ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కూటమి గెలు పే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశే ఖర్, కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మండల నాయకులు పెద్దింటి మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జి పెద్దింటి జగన్, పార్టీ సీనియర్ నాయకులు గుసిడి జగన్నాథం, చెల్లూరి సత్యారావు, గుసిడి వేణు, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం



మత్స్యకారులతో మాట్లాడుతున్న లోకం నాగమాధవి

భోగాపురం: మత్స్య కారులను అన్ని విధాలా ఆదుకుంటామని జనసేన, టీడీపీ బీజేపీ పార్టీల నెల్లి మర్ల నియోజకవర్గ ఎమ్మె ల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. ముక్కాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. పవన్ కల్యాణ్‌కు మత్స్యకారులంటే ఎం తో అభిమానమని, వారి హక్కుల కోసం ప్రతిక్షణం పరితపించే పార్టీ జన సేన పార్టీనే అన్నారు. బడ్డుకొండకు ఇంకోసారి చాన్స్ ఇస్తే నియోజకవర్గాన్ని ని లువునా దోచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వరుపుల సుధాకర్, షైలపల్లి అప్పలకొండ, మండల కోఆర్డినేటర్ పల్లంట్ల జగదీష్, జన సైనికులు పాల్గొన్నారు.

'ప్రజాగళం' భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట, మార్చి 19: ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి డిమాండ్ చేశారు. మంగళవారం శృంగవరపుకోటలో విలేకర్లతో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరిపేట బొప్పాడ ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లక్షలాదిమంది ప్రజలు తోసుకోస్తుంటే నియంత్రించాల్సిన పోలీస్‌లు చోద్యం చూడడం దేనికి సాంకేతికమని ప్రశ్నించారు. కూటమి సభ విజయవంతమైందన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, దోపిడిలో వైసీపీ నేతలు పోటీ పడ్డారని ఈ సభ ద్వారా ప్రధాన మంత్రి స్పష్టం చేశారన్నారు. ఉద్దేశపూర్వకంగానే జగన్ ప్రభుత్వం సభకు అడ్డంకులు సృష్టించిందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, నాయకులు భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, చెక్క కిరణ్ కుమార్ తదితరులున్నారు.

పోలీసులు తటస్థంగా వ్యవహరించాలి

విజయనగరం రూరల్: టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడిగా గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన సభ విజయవంతమైందని ఆ పార్టీల విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారన్నారు. ప్రధాని మోదీ హాజరయ్యే సభకు పోలీసు భద్రత అంతంత మాత్రంగా ఉందని, పోలీసుల్లో కొంతమంది తటస్థంగా వ్యవహరించకుండా ఇంకా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, కంది మురళీ నాయుడు, ముద్దాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోలగట్ల ఓటమి కోసమే పనిచేస్తాం

● అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీ శంకర్



మాట్లాడుతున్న గౌరీ శంకర్

విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. మంగళవారం అనుచరులతో కలిసి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి నగరపాలక సంస్థ, తహసీల్దారు కార్యాలయాలు కబ్జా చేశారని, నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లను డమ్మీ చేస్తూ, వీరభద్రస్వామి తన అనుచరులతో అన్ని పనులు చక్కబెట్టారన్నారు. పనికో రేటు పెట్టి హోల్‌సేల్‌గా దోచుకున్నారన్నారు. చిన్న ఇల్లు కట్టుకునే వాడి నుంచి అపార్టుమెంట్ నిర్మాణాలు చేసే వారి వరకూ ఎవరినీ వదలకుండా డబ్బులు గుంజేశారన్నారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి తేలేదని, గత పాలక వర్గం ఖర్చు చేయకుండా వదిలేసిన రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు తన సొంత నిధుల్లా వ్యయం చేశారన్నారు. అంబటి సత్తర్వు నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంకు రోడ్డు కూడా టీడీపీ హయాంలోనిదేనని, ఎమ్మెల్యే ముచ్చటగా మూడు సార్లు కొబ్బరి కాయలు కొట్టేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఓటమే లక్ష్యంగా తాను, తన అనుచరులు పనిచేస్తామని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ స్పష్టం చేశారు. తిరిగి ఆయననే విజయనగరం ప్రజలు గెలిపిస్తే మిగిలేది నరకమేనన్నారు.. రానున్న ఎన్నికల్లో అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

నగర ప్రజల సమస్యలు పరిష్కరించాలి

● అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావుకు టీడీపీ నేతల వినతి



కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రం చూపిస్తున్న టీడీపీ నాయకులు

విజయనగరం రింగురోడ్డు: నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ తిరుమలరావుకు టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, హంస శ్రీను తదితరులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లా డుతూ ఎన్నికల షెడ్యూల్‌కి ముందు నగర పాలక సంస్థలో నియంతృత్వం, దళారీల వ్యవస్థ ఉండేదన్నారు. ఏ పని జరగాలన్నా ప్రజాప్రతినిధి అనుమతి అవసరం ఉండేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి పాలన అంటే నిరంకుశత్వమే అన్నారు. కార్పొరేటర్లకు తగిన గౌరవం ఉండేది కాదని గుర్తు చేశారు. నియమాలకు విరుద్ధంగా ధనం విచ్చలవిడిగా దుర్వినియోగమైందని ఆరోపించారు. ప్రజలు కట్టిన పన్నులు పక్కదారి పట్టాయన్నారు. ఇప్పటికైనా న్యాయపరంగా, చట్టపరంగా ప్రజలకు అందించాల్సిన సేవలు, ఇంటి ప్లానులు, అపార్టుమెంటు ప్లానులు, శానిటేషన్, పచ్చదనం, పరిశుభ్రత, ఉద్యోగులకు సకాలంలో జీతాలు, ఇతర అలవెన్సులు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల కోడ్‌ను సక్రమంగా పాటించాలని కోరారు. ఇదిలా ఉండగా...విజయనగరం రెవెన్యూ కార్యాలయంలో అస్తవ్యస్త, నియంతృత్వ పాలన నడిచేదని, వీటిని సరిచేసి, ఎలక్షన్ నిబంధనలు పాటించాలని టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, హంస శ్రీను తదితరులు హెచ్‌డీటీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

కోడ్‌పై అవగాహన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బొబ్బిలి: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం తహసీల్దారు వి.త్రినాథరావునాయుడు ఆధర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు సూచనలు చేయవచ్చన్నారు. సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారులు రెడ్డి సాయికృష్ణ, సుబ్బారావు, వైసీపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ ప్రతినిధులు పక్కి చంద్రమౌళి, మువ్వల శ్రీనివాసరావు, పి.శంకరరావు, మునకాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలువల్లో సిల్ట్‌ను తొలగించండి



వార్డు సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణం లోని ఆకులరెల్లివీధి, సంఘ వీధి, చాకలి వీధి, దిబ్బవీధి, మేదరబంద జంక్షన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. కాలువల్లో పేరుకుపో యిన సిల్ట్‌ను ఎప్పటి కప్పుడు తొలగించాలని, మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా చూడాలని పారిశుధ్య సి బ్బందిని ఆదేశించారు. పాకీ వీధిలో నిర్మిస్తున్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. మేదరబంద జంక్షన్‌లో పారిశుధ్య లోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహసమనే చెప్పాలి!





విజయనగరం (ఆంధ్రజ్యోతి) మార్చి 19: కిక్కిరిసిన బస్సులోకి సాహసోపేతంగా తట్టబుట్ట, నెత్తిన పెట్టుకుని ఎక్కిన మహిళలు ప్రయాణం సర్కస్ ఫీట్‌ను తలపించింది. వివరాల్లోకి వెళితే పూసపాటిరేగ మండలం నుంచి నగరానికి చేపలు అమ్ముకునేందుకు వచ్చిన మహిళలు సరుకు చెల్లిపోయిన తరువాత.. ఇంటికి పయనం అయ్యారు. ఏ బస్సు ఖాళీగా లేకపోవటంతో సుమారు గంటనుంచి ఇద్దరు మహిళలు బస్‌కోసం వేచిచూశారు. వారు వెళ్లాల్సిన బస్సులు కాలీగా లేక, ప్రయాణికులు ఫుట్‌పాత్ ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో చేసేది ఏమీలేక కిక్కిరిసిన బస్సులో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. ఏలాగైనా బస్సు ఎక్కేందుకు నడుం బిగించారు. దీంతో ఫుట్‌పాత్‌పై వేలాడుతున్న విద్యార్థులను నెట్టుకుంటూ, తట్టాబుట్టా పట్టుకుని నెట్టుకుంటూ బస్సు ఎక్కేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

● పరారీలో ఐదుగురు ● 19 తులాల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

బెలగాం, మార్చి 19: మన్యం జిల్లాలో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఒక నిందితుడిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మంగళవారం విలేకరులకు వివరించారు. గరుగుబిల్లి మండలం ఖడ్గవలసలో ఫిబ్రవరి 26న వేకువజామున కిమిడి శ్రీరామమూర్తి ఇంటిలో చోరీ జరిగింది. ఆరుగురు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి సుమారు 87 తులాల బంగారు ఆభరణాలు, 50 వేలు నగదును చోరీ చేసి పరారయ్యారు. తీవ్ర సంచలనం రేపిన ఈ ఘటనపై పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో చోరీ కేసులో ఆరుగురు నిందితులను గుర్తించారు. వీరిలో గరుగుబిల్లికి చెందిన ఒక వ్యక్తి, బొబ్బిలికి చెందిన ఒకరు, తూర్పుగోదావరికి చెందిన ఒకరు, పశ్చిమబెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను ముద్దాయిలుగా గుర్తించారు. ఈ నెల 18న బొబ్బిలిలో ప్రధాన నిందితుడైన శంకరాపు నారాయణను అరెస్ట్ చేసి, సుమారు 19 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, ఈ కేసులో నిందితులకు గతంలో నేర చరిత్ర ఉందని ఎస్పీ తెలిపారు. దర్యాప్తు బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించిన పోలీసులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. డీఎస్పీ కృష్ణారావు, ట్రైనింగ్ డీఎస్పీ అజీజ్, సీఐలు కె.రవికుమార్, బి.మంగరాజు పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

● హత్య చేశారంటూ తల్లి ఆరోపణ



చంద్రశేఖర్ (ఫైల్)

విజయనగరం క్రైం: తండ్రి ఈ ఏడాది జనవరిలో మరణించారు. ఇంకా ఆ షాక్ నుంచి కుటుంబం తేరుకోనేలేదు. ఈలోగా ఒక్కగానొక్క కొడుకు.. పొట్టిపిరెడ్డి పూర్ణ చంద్రశేఖర్ (26) రైలు పట్టాలపై విగతజీవిగా పడి ఉండడం చూసి తల్లి వెంకటరమణమ్మ దీనంగా రోదిస్తోంది. వివరాల్లోకి వెళితే... కోరుకొండపాలేనికి చెందిన పొట్టిపిరెడ్డి సింహాద్రినాయుడు, వెంకట రమణమ్మలకు ఏకైక కుమారుడు చంద్రశేఖర్. ఆయన హైదరాబాద్‌లో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. ఇటీవల తండ్రి అనారోగ్యం కారణంగా సొంత గ్రామం కోరుకొండపాలెం వచ్చాడు. తగరపువలసలోని క్యాటరింగ్ సర్వీసులో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది జనవరిలో తండ్రి సింహాద్రినాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా... ఈ నెల 18న కోరుకొండలోని ఎల్లమ్మ జాతరకు స్నేహితులతో కలిసి చంద్రశేఖర్ వెళ్లాడు. తిరిగి ఉదయం ఇంటికి రాకపోవడంతో స్నేహితుడు గోవింద్‌కు తల్లి ఫోన్ చేసింది. ఇంటికి వచ్చి తల్లికి కోరుకొండపాలెంలో గొడవ జరిగిందని తెలిపాడు. ఈలోగా రైలు పట్టాలపై కుమారుడు చంద్రశేఖర్ మృతదేహం ఉందని తెలియడంతో వెంకటరమణమ్మ సంఘటన స్థలానికి వెళ్లింది. కుమారుడు విగతజీవిగా ఉండడం చూసి కన్నీరుమున్నీరైంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ప్రమాదవశాత్తు మృతి చెందినట్టుగా కేసు నమోదు చేశామని జీఆర్‌పీ ఎస్ఐ రవివర్మ తెలిపారు. మృతుడి తల్లి తన కుమారుడిని ఎవరో చంపి రైలు పట్టాలపై పడేసి ప్రమాదంగా చిత్రీకరించే విధంగా చేశారని ఆరోపించారు. దీనిపై ఎస్ఐ రవివర్మ వివరణ కోరగా, విచారణలో నిజాలు వెల్లడవుతాయని తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

డెంకాడ, మార్చి 19: చదువులో ఫెయిల్ అవడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి సమీపంలోని రఘు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న షేక్ లాల్ మజాక్(21) ఇంజినీరింగ్ 4వ సంవత్సరం పూర్తి చేసుకున్నప్పటికీ కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్థాపానికి గురై మంగళవారం తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడాడు. అనంతరం మండలంలోని జొన్నాడ సమీపంలో ప్రైవేటు లేఅవుట్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిది ఎన్‌టీఆర్ జిల్లా నందిగాం గ్రామం. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాజాం రూరల్: పట్టణంలోని ఫైర్ స్టేషన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వీరిలో కొండపేట గ్రామానికి చెందిన వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై రాజాం నుంచి బలిజిపేట వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు గాయాలయ్యాయి. వెంకటరమణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకటరమణ తండ్రి నాగభూషణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాంపురంలో మాల్‌ప్రాక్టీస్

వంగర: సీతారాంపురం పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి మంగళవారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ తనిఖీ బృందానికి పట్టుబడ్డాడు. ఈ మేరకు ఇన్విజిలేటర్, కొండచాకరాపల్లికి చెందిన నాగరాజును బాధ్యతల నుంచి తప్పించినట్టు పరీక్షల నిర్వహణాధికారి ఆనంద్‌రావు తెలిపారు.

కోడిపందేలపై దాడులు

జామి: మండలంలోని అన్నంరాజుపేట శివారులో కోడిపందాల శిబిరంపై ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సాయంత్రం దాడిచేశారు. ఈ దాడిలో 8మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని ఐదు కోడిపుంజులు, రూ.4690 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బంగారం షాపుల్లో మోసాలు

● విజిలెన్స్ విచారణకు డిమాండ్

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని కొన్ని బంగారు షాపుల నిర్వాహకులు వినియోగదారులను మోసగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం, లోక్‌సత్తా నాయకులు పి.శంకరరావు, ఆకుల దామోదరరావులు డిమాండ్ చేశారు. కోమటిపల్లికి చెందిన సత్తి జయమణి అనే వృద్ధురాలు ఐదు నెలల కిందట ఓ బంగారం షాపులో సుమారు రూ.40 వేల విలువైన ఆభరణాలను కొనుగోలు చేసిందన్నారు. ఆ బంగారాన్ని మార్చాలని కోరుతూ తాజాగా షాపునకు వెళ్లిందని... అసలు బంగారానికి బదులుగా నకిలీ బంగారం తిరిగి ఇస్తూ తనను మోసగించారని ఆమె లబోదిబోమంటూ పోలీసు స్టేషన్ ముందు కన్నీరుమున్నీరుగా విలపించిందన్నారు. బొబ్బిలిలో గల కొన్ని బంగారం షాపులపై ఈ తరహా ఆరోపణలు చాలా ఏళ్ల నుంచి ఉన్నాయని, కస్టమ్స్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపి పారదర్శకంగా బంగారం అమ్మకాలు, కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే దేశానికి ఉజ్వల భవిష్యత్

బొబ్బిలి: దేశంలో కాంగ్రెస్ పరిపాలన వస్తే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని పీసీసీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రాజచెరువువలస గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఇటీవల ప్రకటించిన ఎన్నికల హామీలను వివరించారు.

మెరుగైన వైద్యం అందించాలి



హెచ్‌ఏలతో మాట్లాడుతున్న ఏడీ

వేపాడ: రైతు భరోసా కేంద్రాల పరిధిలోని హెచ్‌ఏలంతా పశువులకు మెరుగైన వైద్యం అందజేయాలని శృంగవరపుకోట ఏరియా పశువైద్య శాఖ సహాయ సంచాలకులు చలపతిరావు ఆదేశించారు. నీలకంఠాపురం గ్రామ సచివాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ హెచ్‌ఏలు సక్రమంగా విధులకు హాజ రు కావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో సిబ్బంది, హెచ్‌ఏలు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిబంధనలు అమలు చేయాలి

బొబ్బిలి: ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల ప్రకటనలు, ఫొటోలు, జెండాలు తొలగించాలని అధికారులను కోరారు.

జామి: జామి గ్రామంలో ఇంకా చాల ఇళ్లపై మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లు దర్శనం ఇస్తున్నాయి. ప్రతిరోజు ఈదారిలో తిరిగే అధికారులకు, సిబ్బందికి ఎందుకు కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ
- సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం
- అరాచక పాలనకు స్వస్తి పలకాలని పిలుపు



సీతానగరం: చినభోగిలలో మహిళలతో మాట్లాడుతున్న విజయచంద్ర



పార్వతీపురం రూరల్: సూపర్‌సిక్స్ పథకాలను వేతనదారులకు వివరిస్తున్న టీడీపీ నాయకులు



కురుపాంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

చంద్రబాబును సీఎం చేయాలి

సీతానగరం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేస్తేనే రాష్ట్రం కష్టాలు నుంచి బయటపడుతుందని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర తెలిపారు. మండలంలోని చినభోగిలలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మర్రాపు శంకరరావు, శబ్బాన జగన్నాధం, బొమ్మినాయిని లక్ష్మణరావు, అప్పారావు, సింహాలు పాల్గొన్నారు. కాగా పెదపెంకిలో టీడీపీ మండలాధ్యక్షులు పెంకి వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు రామ్మోహన్‌రావు, రామారావు, సూర్యనారాయణ బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి హామీ పథకం వేతనదారులకు సూపర్ సిక్స్ పథకాలు వివరించారు.

● **పార్వతీపురం రూరల్:** మండలంలోని పులిగుమ్మిలో బాబుష్యూరిటీ కార్యక్రమం మంగళవారంరాత్రి నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరం జీవులు, టీడీపీ మండలాధ్యక్షుడు బోనుదేవి చంద్రమౌళి పాల్గొన్నారు. అలాగే ఎంఆర్‌నగరం పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ వేతనదారులకు సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ మండలాధ్యక్షుడు బోను దేవి చంద్రమౌళి ఆధ్వర్యంలో నాయకులు వివరించారు.ఈసందర్భంగా అరకు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకట్‌నాయుడు మాట్లాడుతూ వచ్చేఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న విజయచంద్రను గెలిపించాలని కోరారు. బొనుదేవి చంద్రమౌళి మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావడం ఎంతో అవసరమన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రమౌళి నగిరెడ్డి, అప్పలనాయుడు, సింహాచలం, ప్రభాకరరావు, బసవ శంకర్ పాల్గొన్నారు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

కురుపాం: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హామీఇచ్చారు. కురుపాంలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేష్, నియోజకవర్గంలో గల టీడీపీ, జనసేన నాయకులు బాబుష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్ కుమార్,మండల కన్వీనర్లు కెవి.కొండయ్య, పాడి సుధాకరరావు,జనసేన నాయకుడు ఎన్.వంశీ,టీడీపీ నాయకులు వెంపటాపు భారతి,లక్ష్మణరావు,ఆకుల రమేష్,కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చొరవ

● అరకు నియోజకవర్గ బీసీ సెల్ టీడీపీ అధికార ప్రతినిధి సత్యనారాయణ



సత్యనారాయణకు సమస్యలు వివరిస్తున్న గిరిజన సంఘాల ప్రతినిధులు

గరుగుబిల్లి: గిరిజన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిస్తామని అరకు పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ టీడీపీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం చిలగాంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన గిరిజన ఐక్య వేదిక ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజనుల అభివృద్ధికి అవసరమైన నివేదికలు తయారుచేసి బీజేపీప్రతినిధి, లోక్‌సభమాజీసభ్యురాలు కొత్తపల్లి గీతకు అందించనున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర ఆదివాసీ సంఘం కార్యదర్శి బి.రామారావు, గిరిజనాభ్యుదయ సంఘం ప్రతినిధి అరిక చంద్రశేఖర్, కోలక గౌరమ్మ, బీజేపీ కార్యదర్శి మణిభూషణరావు, గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు దుక్క సీతారాంతో పాటు పలువురు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగదు తరలింపుపై దర్యాప్తు చేయాలి

● కృష్ణపల్లి తెలుగు యువ నాయకుడు గణేష్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: నగదు తరలింపుపై పూర్తిస్థాయిలో అధికారులు దర్యాప్తు నిర్వహించాలని కృష్ణపల్లి తెలుగుయువ నాయకుడు గణేష్ కోరారు. తమ గ్రామంలో వలంటీర్లు, గృహసారధులకు నగదు పంపిణీకి ఓ వైసీపీ నాయకుడు గ్రామానికి వచ్చాడని తెలిపారు. ఓ వైసీపీనాయకుడి ఇంట్లో సమావేశం నిర్వహించారని మంగళవారం రాత్రి గణేష్ ఆంధ్రజ్యోతికి వివరించారు. నగదు పంపిణీకి ప్రణాళికలు జరుగుతున్నాయని, ముందుగా వలంటీర్లకు నగదు ఇచ్చేందుకు ఓ వైసీపీనాయకుడు డబ్బుతో గ్రామానికి వచ్చినట్లు సమాచారం అందడంతో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామని చెప్పారు.ఆయన స్పందించి ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందాన్ని పంపించారని తెలిపారు. ఆబృందం అధికారులు రాగానే ఓ వ్యక్తి గోడ దూకి వెళ్లిపోవడంతోపాటు నగదును అక్కడ నుంచి తరలిచారని ఆరోపించారు.

ఫిర్యాదుతో గ్రామంలో తనిఖీలు

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లిలో ఓ వైసీపీ నాయకుని ఇంట్లో కొంతమంది వలంటీర్లు సమావేశం నిర్వహిస్తున్నారని, నగదు పంపిణీకి ప్రణాళిక సిద్ధంచేస్తున్నారని కొంతమంది గ్రామస్థులకు తెలి యడంతో వెంటనే ఈ విషయంపై ఎంపీడీవో షేక్‌మహమ్మద్ అకీబజావీదకు ఫిర్యాదుచేశారు. ఎంపీడీవో వెంటనే స్పందించి ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందాన్ని గ్రామానికి పంపించారు. అయితే పూర్తిగా తనిఖీలు నిర్వహించిన అనంతరం అక్కడ ఎటువంటి కార్యక్రమాలు జరగడం లేదని ఫ్లైయింగ్ స్క్వాడ్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా ఫిర్యాదు రావడం వాస్తవమేనని, కానీ అక్కడ వీడియోలతో సహా ఫొటోగ్రఫీ చేశామని ఎంపీడీవో ఆంధ్రజ్యోతికి తెలిపారు. అక్కడ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యక్రమం జరగడం లేదని ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందం తెలియజేశారని, ఈ విషయంపై బుధవారం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

'కార్యకర్తలంతా ముందుండి గెలిపించాలి'

జియ్యమ్మవలస: ఇండియాకూటమిలో భాగంగా అరకు పార్లమెంట్, కురుపాం శాసనసభ నియోజకవర్గాల్లో సీపీఎం పోటీ చేస్తుందని, కార్యకర్తలంతా ముందుండి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, కొల్లి గంగునాయుడులు తెలిపారు.మంగళవారం జియ్యమ్మవలసలో సీపీఎంకార్యకర్తల సమావేశం జరిగింది.సీపీఎం మండల కార్యదర్శి కోరంగి సీతారాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గరుగుబిల్లి శ్రీను, ఎం.రామారావు, సోమయ్య పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ గ్రీవెన్స్‌కు 20 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న జగన్నాథరావు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలోని వైద్య ఆరోగ్య కార్యాలయంలో జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలకు సంబంధించిన సమస్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అర్జీలను ఉద్యోగుల నుంచి స్వీకరించారు. వీటిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

● గరుగుబిల్లి ఎంపీడీవో, తహసీల్దార్ హెచ్చరిక



గొట్టివలసలో పరిశీలిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: గ్రామాల్లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీ డీవో పి.సూర్యనారాయణ, తహసీల్దార్ కె.జయలు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గొట్టివలస తదితర గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ ప్రకట నలు, పోస్టర్లు తొలగించాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి చిత్రంతో కూడిన పలు రకాల స్టిక్కర్లను ఇంటింటికి అతికించారని, వీటిని తక్షణమే తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో ఫిర్యాదులు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలు విధులపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. వర్గ విబేధాలకు తావులేకుండా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టీ బృంద సభ్యులు ఎల్.గోపాలరావు, గౌరీశంకర్, కార్యదర్శి టి.భాస్కరరావు, ఆర్.కాంతి పాల్గొన్నారు.

మజ్జిగౌరి ఆలయ హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న భక్తులు

రాయగడ: రాయగడలోని మజ్జిగౌరిదేవి ఆలయ హుండీ ఆదాయాన్ని ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో లెక్కించారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన లెక్కింపు రాత్రి తొమ్మిది గంటల వరకు కొనసాగింది. భక్తులు అమ్మ వారికి వివిధ రూపాల్లో చెల్లించినకానుకలను బాలాజీ, సాయి మందిర్ భక్తసమాజం వివిధసంఘాల ప్రతినిధులు లెక్కించారు.రూ.89,72, 225, 62 గ్రాముల బంగారం, 2.3 కిలోల వెండిని భక్తులు కానుకల రూపంలో అమ్మవారికి సమర్పించినట్లు ఆలయ ట్రస్టీ రాయసింగ్ బిడిక తెలిపారు. కానుకల రూపంలో వచ్చిన అమ్మవారి కివచ్చిన ఆదాయన్ని ఉత్కళ గ్రామీణ బ్యాంకులో జమచేస్తున్నట్లు చెప్పారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● సబ్‌డివిజనల్ పోలీసు ఆఫీసర్ రష్మిరంజన్ సేనాపతి

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని నిర్భయంగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలని సబ్‌డివిజనల్ పోలీసు ఆఫీసర్ రష్మిరంజన్ సేనాపతి కోరారు.ఈ మేరకు జిల్లాలోని బిసంకటక్, మునిగుడ తో పాటు పట్టణంలో పాత రాయగడ పరిధిలోని పిట్ల వీధి, స్వీపర్ కాలనీ, బుదరాయి వలస, సబ్‌కలెక్టర్ కార్యాలయం పరిధిలో కవాతు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు కవాతు నిర్వహించారు.

ప్రధానికి రక్షణ కల్పించకపోవడం సిగ్గుచేటు

● ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి ● టీడీపీ, జనసేన నాయకుల డిమాండ్



సాలూరు: మాట్లాడుతున్న సంధ్యారాణి

ప్రధాని నరేంద్రమోదీ హాజరైన చిలకలూరిపేట బొప్పూడి ప్రజాగళం సభ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై కేంద్ర ఎన్నికలసంఘం చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్‌చేశారు. ప్రజాగళంసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరైతే వైసీపీ ప్రభుత్వం రక్షణ కల్పించలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈమేరకు మంగళవారం సాలూరు, పాలకొండలో నాయకులు విలేకరులతో మాట్లాడారు.

పోలీసులు చోద్యం దేనికి సంకేతం: సంధ్యారాణి

సాలూరు: లక్షలాది మంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దేనికి సంకేతమని సాలూరు నియోజకవర్గ తెలుగుదేశం-జనసేన అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నించారు.ఈ మేరకు సాలూరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, జనసేన, టీడీపీ తొలి సభ విజయవంతమైందన్నారు. మూడు పార్టీల కార్యకర్తలు,అభిమానులంతా పాల్గొని సభను విజయవంతం చేశారన్నారు. ట్రాఫిక్ సమస్య వల్ల వేలాది మంది సభకు రాలేకపోయారన్నారు. ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో చిలకలూరిసభ ద్వారా తెలుస్తోందన్నారు.ఆరోగ్యశ్రీ సహా అనేక పథకాలకు కేంద్రం నిధులిస్తున్నా ఏపీప్రభుత్వం సొంత స్టిక్కర్లు వేసుకొని ఏపీ ప్రభుత్వం అంతా తామే ఇస్తున్నట్లు ప్రచారంచేసుకుంటోందని ప్రధాని చెప్పింది నూటికి నూరుశాతం నిజమన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు తిరుపతిరావు, ప్రసాద్‌బాబు, ఆముదాల పరమేష్, వైకుం ఠపు హర్షయాసర్ల అప్పారావు, రెడ్డి ధర పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యం బహిర్గతం: విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ఎన్‌డీఏ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ప్రజాగళం సభ విజయవంతమైందని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర తెలిపారు.పార్వతీపురం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయనతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ ప్రజాగళం సభకు దేశ ప్రధాని నరేంద్రమోడీ హాజరైతే వైసీపీప్రభుత్వం సరైన పోలీస్ రక్షణ కల్పించలేకపోవడం సిగ్గుచేటన్నారు.పోలీసుల వైఫల్యం బహిర్గతమయ్యిందని తెలిపారు. ఎన్ని కల సంఘం ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం పనిచేస్తున్నట్టు గుర్తించుకోవాలన్నారు. ప్రజాగళంసభ విజయవంతం కావడాన్ని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చిలకలూరిపేటలో పోలీసుల నిర్లక్ష్యంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తామన్నారు. బీజేపీజిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి శ్రీని వాసరావు మాట్లాడుతూ సాక్షాత్తూ ప్రధానమంత్రి పాల్గొన్న సభకు పూర్తి స్థాయిలో పోలీస్‌రక్షణ కల్పించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జి.రవికుమార్, ఎం.వెంకటేష్, కె.మధు, వెంకటనాయుడు పాల్గొన్నారు.

మరిపిల్లిలో వైభవంగా సీతమ్మకు క్షీరాభిషేకం



సాలూరు రూరల్: సీతమ్మ,ఆంజనేయ విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సాలూరు రూరల్: మరిపిల్లిలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహో త్సవాల్లో భాగంగా మంగళవారం సీతమ్మకు క్షీర, ధాన్యాభిషేకం నిర్వహించారు. గ్రామంలో బుధవారం అభయాంజనేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీతమ్మకు కుంకుమ పూజలు చేశారు. ఆంజనేయ విగ్రహానికి జలక్షీర,ధాన్యాధివాసాలను నిర్వహించారు.

దాసాంజనేయునికి పూజలు

సాలూరులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన దాసాంజనేయునికి ఫాల్గుణ మాస శుద్ధ దశమి పురస్కరించుకుని మంగళవారం రుత్విక్కుడు నారాయణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాసాంజనేయునికి వడమాల, పుష్పమాల, తమాలపత్ర మాలలతో అలంకరించారు. సింధూరంతో అష్టోత్తర శతనమార్చన నిర్వహించారు. .

నేడు సాలూరు గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ

సాలూరు గ్రామదేవతలు కొత్తమ్మ,ముత్యాలమ్మకు కొత్త ఆలయాలు నిర్మించి విగ్రహాలు ప్రతిష్ఠ పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు, క్షీర,ధాన్యాధివాసాలను నిర్వహించారు. బుధవారం నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను ఆలయ కమిటీలు నిర్వహించనున్నాయి.

సీతారామాలయంలో విశేష హోమాలు



విశేషహోమాల్లో పాల్గొన్న భక్తులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని సీతారామాలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిప్రతిష్ఠ, విశేష హోమాలు పట్టణ గ్రూపుదేవాలయాల ఈవో ప్రసాదు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ ఉపాసకులు బ్రహ్మశ్రీ శ్రీనివాస శర్మ, రుత్విక్కుల వేదమంత్రోశ్చరణల మధ్య బుధవారం ఉదయం పది గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మజ్జి రామం బ్రదర్స్, గౌరీశంకర బాల కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంటలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు పురోహితులు బ్రహ్మశ్రీ అంపోలు శ్రీనివాసరావుశర్మ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ ఉరిటి రామారావు, సర్పంచ్ ఉరిటి నిర్మల ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఆలయం నిర్మించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన తిరువీధి మహోత్సవ ంలో మహిళలు, జి.శంకరరావు, జి.వెంకటనాయుడు, డి.ధనుంజయరావు, జి.రామినాయుడు, వై.పోలినాయుడు, వై.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి యాత్ర



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కురుపాం: కురుపాంలో మంగళవారం సిర్లి ఎల్లమ్మ, పోతన్న యాత్ర ఘనంగా నిర్వహించారు. గ్రామం శివారులోని గౌడవీధి వెనుక గల సిర్లి పోతన్న ఆలయంలో పుట్టకు తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

భామిని: బత్తిలిలోని సంతోషిమాత ఆలయ 38 వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయం త్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఐదురోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.



సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పాలకొండలో వర్షం



పాలకొండలో వర్షం కురుస్తున్న దృశ్యం

పాలకొండ: పట్టణంలోని మంగళవారం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడడం వల్ల ప్రజలు ఉపసమనం పొందారు. ఆరుతడి పంటలకు ఈవర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

మక్కువ: మండలంలోని డి.సిర్లము సమీపంలో సువర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. సమాచారం మేరకు మంగళవారం ఉదయం దాడులు నిర్వహించినట్లు చెప్పారు.ఈ మేరకు ఇందుపురం గ్రామానికి చెందిన ఇప్పిలి కృష్ణ, పుత్తూరు గ్రామానికి చెందిన మూడడ్ల ప్రదీప్, పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. ఈ ట్రాక్టర్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

'హామీలు తుంగలో తొక్కారు'

పాలకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ తుంగలోకి తొక్కిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కార్యదర్శి కాద రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు తెలిపారు. మంగళవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలు రద్దు చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో సీహెచ్ సంజీవి, ఎ.లక్ష్మణరావు, జి.సారిక, బి.వాణి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

● గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు



జియ్యమ్మవలస: చినకుదమలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



వీరఘట్టం: కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

వీరఘట్టం: రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అవగాహన కల్పించడానికి కవాతు నిర్వహించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈమేరకుమండలంలోని రేగులపాడు, హుస్సేన్‌పురం గ్రామాల్లో అర్‌పీఎఫ్ బృందాలతో ఎస్ఐ ఎస్.కె.షక్రుద్దీన్ సిబ్బంది ఆధ్వర్యంలో పోలీసులు కవాతు మంగళవారం నిర్వహించారు.

● **జియ్యమ్మవలస :** చినకుదమ, పెదకుదమ, సింగనాపురం గ్రామాల్లో చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు ఆధ్వర్యంలో 60 మంది కేంద్ర బలగాల సిబ్బంది, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును ఎటువంటి ప్రలోభాలు, ఇబ్బందులకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవచ్చనని అవగాహన కల్పించేందుకే కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

లక్ష్మీనారాయణపురంలో స్టిక్కర్ల తొలగింపు

పార్వతీపురం రూరల్: మండలంలోని లక్ష్మీనారాయణపురం తదితర గ్రామాల్లో ఇంటింటా అంటించిన జగనన్న స్టిక్కర్లను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతురావు పర్యవేక్షణలో మంగళవారం తొలగించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతురావు, ఏఎస్‌వో సత్యనారాయణ, గ్రామ సచివాలయ కార్యదర్శి నరేంద్ర, వీఆర్‌వో పురుషోత్తం పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి

సాలూరు రూరల్: కొఠియా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరాపుట్ జిల్లా కలెక్టర్ కీర్తివాసన్ పిలుపునిచ్చారు. మంగళవారం సాలూరు మండలంలోని కొఠియా గ్రూపులోని ముడకారు, కొఠియా, గంజాయిభద్రలో కోరాపుట్ జిల్లాఅధికారులుఓటర్లకు చైతన్య కార్యక్రమాలు, పట్టుచెన్నారు, పగులుచెన్నారు, ఎగువ మెండగివాసులకు ఓటర్ల చైతన్యంపై ముగ్గులు పోటీలను నిర్వహించారు. గ్రామంలో ఓటర్ అవగాహన ర్యాలీ చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో పొట్టంగి బీడీవో సుకాంత్‌కుమార్ పట్నాయక్, తహసీల్దార్ బహదూర్‌సింగ్ దరువా పాల్గొన్నారు.



కొఠియాలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు,గిరిజనులు